సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 9 । జనవరి । 2023



ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధ్యమే.. 8లో



అందంగా.. కళాత్మకంగా

పర్యాటక ప్రాంతాల్లో లభించే వెదురుతో అనేక కళాత్మక వస్తువులు తయారుచేసి విక్రయిస్తూ నిరుద్యోగ యువత ఉపాధి పొందుతున్నారు 8లో

రక్తనిధికై.. ఆగని నడక

- రక్తదానంపై ప్రజల్లో అవగాహనకు యువకుడి సాహసం
- 21 వేల కిలోమీటర్లే లక్ష్యంగా సాగుతున్న పాదయాత్ర 8లో



న్యూస్‌రీల్

నేడు 'ప్రజా సంకల్పయాత్ర' విజయోత్సవం

- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాట్లు

సాక్షి,పాడేరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేత హోదాలో రాష్ట్రంలో చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు సోమవారంతో నాలుగేళ్లు పూర్తవుతున్నాయి.ఈ మేరకు జిల్లా కేంద్రమైన పాడేరులో విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఏర్పాట్లు చేస్తున్నారు. పాడేరు పాత బస్టాండ్‌లో సోమవారం ఉదయం పది గంటలకు విజయోత్సవ కేక్ కట్ చేయడంతో పాటు,మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు తప్పనిసరిగా హాజరుకావాలని మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు కోరారు.

మోదమ్మ భక్తులకు ఉచిత ప్రసాదం



మోదమ్మ ఆలయంలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఆలయ కమిటి ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహచలంనాయుడు ఉచిత ప్రసాదాల పంపిణీని అమలుచేస్తున్నారు. ప్రతి ఆదివారం భక్తులు సహకారంతో ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు సహకారం లేని రోజు మాత్రం ఆలయ కమిటీ ఉచిత ప్రసాదాల పంపిణీ బాధ్యత చేపడుతోంది. ఆదివారం అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మోదమ్మను దర్శించుకున్నారు. వారందరికీ స్థానిక భక్తుల సహకారంతో ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం భోజనాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రసాదాల నిర్వహాక కమిటీ సభ్యులు ఏర్పాటుచేశారు.

మత్స్యలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

- దర్శించుకున్న సబ్ కలెక్టర్ అభిషేక్
- ఆలయానికి దీపం కుందులు సమర్పణ



పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రమైన మత్స్యగుండం మత్స్యలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సబ్ కలెక్టర్ అభిషేక్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. నిత్య దీపారాధనకు రెండు కంచు దీపపు కుందులను ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయనతో పాటు స్థానిక తహసీల్దార్ రాజ్యలక్ష్మి, రెవెన్యూ అధికారులను సర్పంచ్ శాంతకుమారి, కమిటీ సభ్యులు స్వామివారి చిత్ర పటం అందజేశారు. శాలువా కప్పి సత్కరించారు. ఆర్ఐ రంగారావు, బ్బంది సూర్యప్రకాష్, కమిటీ సభ్యులు మత్స్యకొండబాబు, సింహాచలంనాయుడు, అప్పారావు, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సమావేశం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని హాజరు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సమావేశం సోమవారం విశాఖలో నిర్వహించనున్నారు. సిరిపురం వీఎంఆర్‌డీఏ బాలల ఎరీనాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ముఖ్యఅతిథిగా హాజరవుతారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, కార్యదర్శి నవీన్ కుమార్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ పాల్గొంటారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వైద్య ఆరోగ్య శాఖాధికారులు, అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పలు విషయాలపై చర్చించనున్నారు.

హిమ సోయగం

- దట్టంగా మంచు వాన
- వణికిస్తున్న చలిగాలులు
- అల్లాడుతున్న మన్యం వాసులు

మన్యం గిరులు హిమసోయగంతో నిండిపోయాయి. మంచు.. వర్షంలా కురవడంతో కశ్మీరును తలపించాయి. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో మంచు పేరుకుపోయింది. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చిన పర్యాటకులు ప్రత్యేక అనుభూతి పొందారు. చలి తీవ్రతకు తాళలేకపోయారు. సముద్ర మట్టానికి సుమారు 3.600 అడుగుల ఎత్తులో ఉన్న లంబసింగి గిరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆహ్లాదకరం.. అందమైన వాతావరణం మన్యానికే సొంతం.



జి.మాడుగుల మండలంలో పంట పొలంలో పేరుకుపోయిన మంచు (ఇన్‌సెట్) గడ్డ కట్టిన మంచు



లంబసింగిలో వర్షం మాదిరిగా కురుస్తున్న మంచు



పాడేరు పాతబస్టాండ్ వద్ద చలిమంట కాగుతున్న చిన్నారులు



రాజవొమ్మంగిలో కమ్మేసిన మంచు తెరలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఒకపక్క మంచు, మరోపక్క చలిగాలులు విజృంభిస్తున్నాయి. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలితీవ్రత నెలకొంది. వీటికి పొగమంచు తోడవ్వడంతో ప్రజలు వణికిపోతున్నారు. అరకులోయ, కురిడి, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాల్లో మంచు పేరుకుపోయింది. ఉదయం ఏడు గంటలకు సూర్యోదయం కనిపించింది. సాయంత్రం నుంచి చలిగాలులు విజృంభిస్తున్నాయి.

జి.మాడుగుల: మండలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలిగాలులు వణికిస్తున్నాయి. ఉదయం 10 గంటల వరకు మంచు కురుస్తూనే ఉంది. చలి నుంచి ఉపశమనం పొందేందుకు మంటలను ఆశ్రయించారు.

పర్యాటకులు విలవిల

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో ఆదివారం వర్షాన్ని తలపించేలా మంచు కురిసింది. గడ్డిపై పేరుకుపోయింది. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు కొత్త అనుభూతి పొందారు. మరోపక్క చలి తీవ్రతకు తాళలేక విలవిల్లాడిపోయారు.

రాజవొమ్మంగి: మండలంలో వాతావరణం మంచు తుపానును తలపించింది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. దారులు కనుపించక వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. మండలంలో 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. పగటి పూట కూడా అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవడంతో చలి వణికించింది.

గూడెంకొత్తవీధి: మండలంలో శనివారం రాత్రి చలి వణికించింది. ఎన్నడూ లేనివిధంగా గిరి గ్రామాలను మంచు తెరలు కమ్మేశాయి.

విదేశీ పూల పరిమళం



ఆకట్టుకుంటున్న తులిప్ పూలు

- మంచి దిగుబడి నిచ్చిన 'తులిప్'
- ఫలించిన శాస్త్రవేత్తల పరిశోధనలు
- అగ్రి టూరిజం ప్రాజెక్ట్ విజయవంతం
- ఏజెన్సీలో సాగుకు అనుకూలం
- చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్



డాక్టర్ సురేష్‌కుమార్


చింతపల్లి: అగ్రి టూరింజంలో భాగంగా స్థానిక చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో చేపట్టిన విదేశీ పూల సాగు విజయవంతమైంది. ఏజెన్సీ వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చినట్టు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు పరిశోధన స్థానంలో తులిప్, గ్లాడియోలస్, చైనా ఆస్టర్, లిల్లియం తదితర విదేశీరకాల పూలసాగును శాస్త్రవేత్తలు చేపట్టారు. దాదాపుగా అన్నిరకాల్లో మంచి దిగుబడి వచ్చింది. నెదర్లాండ్‌లో వాణిజ్య పరంగా సాగు చేస్తున్న తులిప్ పూలను మన దేశంలో అత్యంత శీతల వాతావరణం కలిగిన కశ్మీర్, హిమచల్ ప్రదేశ్‌లో పండిస్తున్నారు. వీటి విత్తనాలను ఢిల్లీ నుంచి రప్పించి ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు. ఆశించిన దాని కన్నా మంచి దిగుబడి వచ్చింది. ఈ పూల రకాలను పర్యాటకంగా గుర్తింపు పొందిన లంబసింగి, అరకు, పాడేరు ప్రాంతాల్లో గిరిజనులు సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పూలసాగుకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. షేడ్ నెట్లలో మాత్రమే సాగు చేపట్టాల్సి ఉంటుంది. కాఫీ సాగు తరువాత అదేస్థాయిలో పూలసాగు చేపట్టి మంచి ఆదాయం పొందవచ్చని పరిశోధన స్థానం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చి డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. వాణిజ్య పరంగా సాగు చేసేందుకు ఇక్కడి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.



విరబూసిన లిల్లియం పూలు

బాస్కెట్‌బాల్ ఫైనల్‌కు విశాఖ, కృష్ణా మహిళా జట్లు

అనకాపల్లి రూరల్: స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం పలు జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు హోరా హోరీగా సాగాయి. పురుషుల విభాగంలో చిత్తూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం, కృష్ణా జిల్లాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. తొలుత ఈ పోటీలను కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ స్వామినాయుడు, అసిస్టెంట్ పీడీలు నాయుడు, పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.



రసవత్తరంగా సాగుతున్న బాస్కెట్‌బాల్ పోటీలు

జనజీవన స్రవంతిలో కలిస్తే పునరావాసం

- ముందుకు వచ్చిన మావోయిస్టులకు స్వేచ్ఛా జీవనం
- పోలీసుశాఖ సంపూర్ణ సాయం
- ఎస్పీ సతీష్‌కుమార్
- ఘనంగా వారధి, ఆత్మీయ సమ్మేళనం



మాజీ మావోయిస్టులు,సానుభూతిపరులకు సంక్రాంతి కానుక సామగ్రి పంపిణీ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్,చింతపల్లి ఏఎస్పీ శివప్రతాప్ కిషోర్, సీఆర్‌పీఎఫ్, పోలీసు అధికారులు

సాక్షి, పాడేరు: గిరిజనుల అభివృద్ధి నినాదంతో పోలీసుల పిలుపుమేరకు జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు, సభ్యులు, సానుభూతిపరులకు పునరావాస చర్యలు చేపడుతున్నామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. జిల్లాలోని మావోయిస్టు పార్టీకి చెందిన పెదబయలు, కోరుకొండ, గాలికొండ ఏరియా కమిటీలతో పాటు, ఈస్ట్‌డివిజన్ కమిటీలో పనిచేసి పోలీసుల సమక్షంలో గతంలో లొంగిపోయారు. వీరికి సంక్రాంతి కానుకతో తమ వంతు సాయం అందించేందుకు పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఆదివారం ఎస్పీ కార్యాలయం సమీపంలోని మైదానం వద్ద వారధి, ఆత్మీయ సమ్మేళనం సంబరాలను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు సభ్యులు, మిలీషియా సభ్యుల స్వేచ్ఛాజీవనానికి ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం, పోలీసుశాఖ చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అత్యంత మారుమూల గ్రామాలకు రోడ్లతో పాటు,గెడ్డలపై వంతెనల నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని పేర్కొన్నారు. రవాణా సౌకర్యాలతో పాటు కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని ఎస్పీ వివరించారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, గిరిజనుల అభివృద్ధికి పోలీసుశాఖ పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండి, అభివృద్ధి నినాదానికి సహకరించాలని ఆయన కోరారు. అనంతరం లొంగిపోయిన సుమారు 180 మందికి ఎస్పీ, ఇతర అధికారులు భోజనం వడ్డించారు. వారితో కలిసి భోంచేశారు. మావోయిస్టు మాజీ దళసభ్యులు చిక్కుడు సుధీర్,శ్రీకాంత్‌తో పాటు మరో ఎనిమిది మంది సభ్యులు,ఇతర మిలీషియా సభ్యులు, సానుభూతిపరులందరికి సంక్రాంతి కానుకల్లో భాగంగా పలు రకాల స్టీల్, వంట సామగ్రి, క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. చింతపల్లి ఏఎస్పీ శివప్రతాప్ కిషోర్, ఎస్‌బీఎక్స్ డీఎస్పీ వెంకటరావు, సీఆర్‌పీఎఫ్ సుర్మతి, పాడేరు విభాగాల అసిస్టెంట్ కమాండెంట్లు ఉదయ్, మురుగవేలు, పాడేరు, జి.మాడుగుల సీఐలు సుధాకర్, సత్యనారాయణ, పలు స్టేషన్ల ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరానికి తరలివచ్చిన గిరిజనులు

హుకుంపేట: మండలంలోని ఉప్ప ప్రభుత్వ ప్రాథమిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమెరికన్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో విశాఖ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి భారీగా రోగులు తరలివచ్చారు. సుమారు 700 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్టు ఫౌండేషన్ రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకృష్ణ, రోటరీ క్లబ్ సెంట్రల్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తెలిపారు. రోటరీ క్లబ్ ప్రాజెక్టు చైర్‌పర్సన్ డా.రాకేష్, సిబ్బంది లావణ్య, ఉదయశ్రీ పాల్గొన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయి..



ఐతయ్య, కమల మృతదేహాలు



తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులు

- అనాథలైన నలుగురు చిన్నారులు
- వక్రీకరించిన విధి
- దయనీయంగా కుటుంబ పరిస్థితి

చింతూరు: ఆ కుటుంబాన్ని విధి వక్రీకరించింది. ఆరుగురు ఆడపిల్లల అనంతరం ఏడో కాన్పులో మగబిడ్డ కోసం ఎదురుచూస్తున్న భార్యాభర్తలకు పురిటిలోనే మగబిడ్డ మృతిచెందడం వారిని కలచివేసింది. దీంతో ఆవేదనకు గురైన వారు ఒకరి తరువాత ఒకరుగా తనువు చాలించడం తెలిసిందే. కొవ్వాసి ఐతయ్య, కమల మృతదేహాలను భద్రాచలం ఆస్పత్రి నుంచి ఆదివారం ఇరకంపేట తీసుకువచ్చి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇలావుండగా తల్లిదండ్రుల మృతితో నలుగురి చిన్నారులు అనాథలయ్యారు. ఐతయ్య కుటుంబం కొన్నేళ్లక్రితం సరిహద్దునే ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చింది. ఆ కుటుంబానికి వ్యవసాయ కూలి పనులే ఆధారం. వారి మృతితో చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. కమల మృతికి రక్తహీనతే కారణమని ఏడుగురాళ్లపల్లి వైద్యాధికారి విశ్వచైతన్య తెలిపారు. కాన్పుల మధ్య దూరం పాటిస్తే రక్తహీనత రక్తహీనత సమస్య తలెత్తదని ఆయన పేర్కొన్నారు.

చలిలోనూ జోష్



వంజంగి హిల్స్‌పై పర్యాటకుల సందడి

- పోటెత్తిన పర్యాటకులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి చలిగాలులు తీవ్రత నెలకొన్నప్పటికీ వంజంగి, చెరువులవేనం,మాడగడ హిల్స్ ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి తగ్గలేదు.ఆదివారం వేకువజామునే పర్యాటక ప్రాంతాలకు చేరుకున్నారు.సూర్యోదయం, పొగమంచు, మేఘాల కొండలపై అందాలను తిలకించారు. ఉదయం 11గంటల వరకు సందడి నెలకొంది.

పాపికొండల పర్యటనకు 436 మంది

దేవీపట్నం: గోదావరిలో బోటు ప్రయాణం చేస్తూ పాపికొండల అందాలను వీక్షించేందుకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన సందర్శకులు రాజమహేంద్రవరం నుంచి పోశమ్మగండికి వాహనాల్లో తరలివచ్చి ఏడు టూరిజం బోట్ల ద్వారా 436 మంది పర్యాటకులు పేరంటపల్లికి తరలివెళ్లారు. లైఫ్ జాకెట్లు ధరించి నిబంధనలను పాటిస్తూ వెళ్లిన పర్యాటకులు సాయంత్రం నిర్దేశించిన సమయానికి తిరిగి పోశమ్మగండికి చేరుకున్నారు.

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి భారీగా పర్యాటకులు తరలివచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాలతో ఒడిశా నుంచి ప్రత్యేక వాహనాల్లో విచ్చేశారు. ప్రకృతి అందాలను తిలకిస్తూ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.



ప్రకృతి అందాలను వీక్షిస్తున్న సందర్శకులు



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి

ఆధునికతపై ఆసక్తి



యంత్రాల సాయంతో గాలిపోత, వరి నూర్పిడి పనుల్లో గిరి రైతులు

గూడెంకొత్తవీధి: గిరి రైతులు పంట సాగు, సేకరణ విధానాల్లో ఎంతో మార్పు కనిపిస్తోంది. ఆధునిక యంత్రాల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. వరి నూర్పిడికి గతంలో గాలిపోత విధానాన్ని అవలంభించేవారు. ఇప్పుడు ఆధునిక యంత్రాలను వినియోగిస్తూ పెట్టుబడిని ఆదా చేసుకుంటున్నారు. ఆధునిక యంత్రాల వినియోగానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

క్లుప్తంగా

సికిల్‌సెల్ బాధితురాలికి పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న సర్పంచ్ మంగా బొజ్జయ్య

రంపచోడవరం: ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య అన్నారు. పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సికిల్‌సెల్ బాధితులకు ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన వైఎస్సార్ పింఛన్ కానుకను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలందరికీ పింఛన్లు అందజేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. సికిల్‌సెల్ ఎనిమియా బాధితులకు ప్రభుత్వం రూ.10వేలు పింఛన్ అందజేయడం హర్షణీయమన్నారు. ఉప సర్పంచ్ వీఎం కన్నబాబు, వార్డు మెంబరు పాపలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ షెడ్డు దగ్ధం

చోడవరం రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ బైక్ మెకానిక్ షెడ్ దగ్ధమైంది. స్థానిక ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో ఉన్న ఆటో స్టాండ్ వద్ద షెడ్ ఏర్పాటు చేసుకుని కొట్టాపు సత్తిబాబు అనే వ్యక్తి బైక్ మెకానిక్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చెక్కల బడ్డీలో షెడ్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా షెడ్‌లో మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న ఎక్సైజ్ సిబ్బంది గమనించి కేకలు వేయడంతో పొరుగున ఉన్న ఆటో స్టాండ్‌లోని డ్రైవర్లు పరుగున వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాద సమాచారం అందుకున్న చోడవరం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రామస్వామి తమ సిబ్బందితో ప్రమాదస్థలికి చేరుకున్నారు. అప్పటికే మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

కశింకోట: మండలం కేంద్రం కశింకోటలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ గాయపడ్డాడు. స్థానిక కూడలి వద్ద మలుపు తిరుగుతున్న ట్రాక్టర్‌ను వ్యాన్ ఢీకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ కింద పడి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

అందంగా.. కళాత్మకంగా


వెదురుతో తయారుచేసిన లాంతర్లు


బొర్రాగుహల వద్ద వెదురుతో తయారు చేసిన వస్తువుల అమ్మకాలు

- వెదురుతో అలంకరణ వస్తువులు
- ఆకట్టుకుంటున్న విభిన్న మోడళ్లు
- ఉపాధి పొందుతున్న నిరుద్యోగులు

అనంతగిరి: ప్రకృతిలో లభించే వనరులనే ఆదాయ మార్గాలుగా ఎంచుకున్నారు..గిరిజనులు.. పర్యాటక ప్రాంతాల్లో లభించే వెదురుతో అనేక కళాత్మక వస్తువులు తయారుచేసి విక్రయించి నిరుద్యోగ గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. వెదురుతో తయారుచేసిన వస్తువులను ఎక్కువగా పర్యాటకులు కొనుగోలు చేస్తున్నారు. పర్యావరణహితంగా తయారు చేస్తున్న వెదురు వస్తువులకు మంచి ఆదరణ వస్తోంది.

రకరకాల వస్తువుల తయారీ

అటవీ ప్రాంతాల్లో లభించే మంచి వెదురును సేకరించి, బాగా శుభ్రం చేస్తారు. వాటిని ఎండబెడతారు. అనంతరం వెదురును బాగా ఫినిషింగ్ చేసి, వస్తువులు తయారు చేస్తారు. అనంతరం ఆయా వస్తువులకు వివిధ చెట్ల బెరడుల నుంచి సేకరించిన ద్రవాలతో పాలిషింగ్ చేస్తారు. ఫోటో ఫ్రేమ్‌లతో పాటు ఆధునిక ఉట్టిపడేలా హ్యాంగిగ్స్, టీ కప్పులు, వాటర్ బాటిల్స్, ఫ్లవర్‌వాజ్‌లు, ఫ్రూట్ వేజ్‌లతో పాటు చిన్నారుల కోసం ఆట వస్తువులతో పాటు వంటింట సామగ్రి తయారు చేస్తున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న గిరిజన నిరుద్యోగులు చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటుచేసుకొని వెదురుతో తయారుచేసిన వస్తువులను విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు. వెదురుతో చేసిన వస్తువులపై పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. అందంగా ఆకర్షణీయంగా, కళాత్మంగా ఉన్న వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. అరకులోయ హట్టగుడతో పాటుగా జగదల్‌పూర్‌లోని మారుమూల గ్రామాల్లో వెదురుతో గిరిజనులు పర్యాటకులను ఆకర్షించే వస్తువులను తయారుచేస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించి, వెదురుతో వస్తువుల తయారీచేసి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.


బెంబోతో తయారుచేసిన వాటర్ బాటిళ్లు

వ్యాపారం బాగుంది



బొర్రా గుహల వద్ద చిన్న దుకాణం ఏర్పాటుచేసుకున్నారు. వెదురుతో తయారుచేసిన వివిధ వస్తువులు విక్రయిస్తున్నాను. ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఆయా వస్తువులు కొనుగోలు చేస్తుండడంతో జీవనోపాధి పొందుతున్నాం. పర్యాటకుల ఆదరణ బాగుంది. ప్రస్తుత సీజన్‌లో వ్యాపారం బాగుంది. అన్‌సీజన్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లి వస్తువులను విక్రయిస్తున్నాం. పర్యాటకుల నుంచి వెదురు వస్తువులకు మంచి ఆదరణ ఉంది. – అభి, వ్యాపారి

పూనకాలు మొదలయ్యాయి..

- ఘనంగా వాల్తేర్ వీరయ్య ప్రీ రిలీజ్ వేడుక
- వేల సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు
- డ్యాన్సులతో అలరించిన నటులు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహారాజ్ రవితేజ అభిమానుల్లో పూనకాలు లోడయ్యాయి. తమ అభిమాన నటులను నేరుగా చూసే సరికి వారిలో ఆనందాలకు హద్దుల్లేకుండా పోయాయి. వారి మాటలకు యువతలో ఉత్సాహం ఉప్పొంగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఆదివారం జరిగిన వాల్తేరు వీరయ్య చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహారాజ్ రవితేజ, డైరెక్టర్ బాబీ, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, ఇతర నటీనటులు పాల్గొని ఈ సినిమా అనుభవాలను అభిమానులతో పంచుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు పూనకాలు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సుమ యాంకరింగ్‌తో అలరించింది.

చిందేసిన ఊర్వశి, దేవీశ్రీ, శేఖర్ మాస్టర్

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నటి ఊర్వశి రౌటేలా, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్, డ్యాన్స్ మాస్టర్ శేఖర్, ఫైట్‌మాస్టర్లు రామలక్ష్మణ్‌లు డ్యాన్స్‌లు వేసి అభిమానులను అలరించారు. వేర్ ఈజ్ ద పార్టీ.. బాసు వేర్ ఈజ్ ద పార్టీ.. నా బోటే ఎక్కు... డీజే నొక్కు బొంబాటు పార్టీ పాటకు ఊర్వశి తనదైన స్టైల్‌లో స్టెప్పులు వేసి కుర్రకారును ఉర్రూతలూగించారు. మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్ చిరంజీవి, రవితేజ సినిమాల్లో పాటలు పాడి.. డ్యాన్స్‌లు చేసి ప్రాంగణాన్ని హోరెత్తించారు. చివరగా డ్యాన్స్ మాస్టర్ శేఖర్, ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ్‌లు పూనకాల లోడింగ్ పాటకు డ్యాన్స్ చేసి అభిమానులకు పూనకాలు రప్పించారు.

నిరాశతో వెనుదిరిగిన అభిమానులు

మెగాస్టార్ చిరంజీవిని చూసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేల సంఖ్యలో అభిమానులు ఏయూ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అయితే అప్పటికే గ్యాలరీలు నిండిపోవడంతో పాసులు ఉన్నప్పటికీ అభిమానులను పోలీసులు లోపలకు అనుమతించలేదు. దీనితో వేల సంఖ్యలో అభిమానులు నిరాశతో వెనుదిరిగారు.


వేదికపై చిరంజీవి, రవితేజ

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధ్యమే..

- విశాఖ ఆర్గానిక్ మేళా కార్యదర్శి షణ్ముఖరావు
- మూడో రోజు భారీగా సందర్శకుల తాకిడి

ఎంవీపీకాలనీ: ప్రకృతి వ్యవసాయంతో లాభాలు సాధ్యమేనని విశాఖ ఆర్గానిక్ మేళా కార్యదర్శి వి.షణ్ముఖరావు అన్నారు. గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖ ఆర్గానిక్ మేళా–2023లో భాగంగా ఆదివారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఆవు ఆధారంగా 30 ఎకరాల్లో వ్యవసాయం చేసేందుకు అవకాశం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం ప్రారంభించిన రెండేళ్లలోనే భూమి సారం పెరుగుతుందన్నారు. తద్వారా పంటల నాణ్యత, ఉత్పత్తి గణనీయంగా పెరుగుతాయన్నారు. దీర్ఘకాలంలో సేంద్రియ వ్యవసాయం లాభాలకు బాటలు వేస్తుందన్నారు. గో ఆధారంగా పాలేకర్ విధానంలో సేంద్రియ వ్యవసాయం ఏవిధంగా చేయాలో రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పాలేకర్ విధానంలో వ్యవసాయం ఆరోగ్యకరం, రుచికరం, ఆదాయవంతంగా ఉంటుందన్నారు.

రుచికరంగా సత్త్వ మిల్లెట్ ఫుడ్



ప్రదర్శనలో సత్త్వ సంస్థ ఏర్పాటు చేసిన మిల్లెట్ ఫుడ్ కోర్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాగులు, సజ్జలు, జొన్నలతో పాటు సేంద్రియ చిరుధాన్యాలతో కూడిన 35 రకాల వంటకాలను సందర్శకులకు అందించింది. రూ.100 నుంచి ఆయా ఉత్పత్తులతో భోజనం అందుబాటులో ఉండటంతో సందర్శకులు పెద్ద ఎత్తున విక్రయాలు చేసి ఆయా పదార్థాలను రుచిచూశారు. దీంతోపాటు అల్పాహార పదార్థాలను అందుబాటులో ఉంచింది. అనేక రకాల ఉత్పత్తులతో తయారు చేసిన చిరుతిండ్లను సైతం ఈ సంస్థ అందుబాటులో ఉంచడంతో కొనుగోళ్లు జోరుగా జరిగాయి. చిరుధ్యాన్యాలతో కూడిన ఆహార ఉత్పత్తులను నగర ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు త్వరలోనే ఆర్యోగ రథం అనే సంస్థను అందుబాటులోకి తేనున్నట్లు సత్త్వ నేచురల్స్ నిర్వాహకులు వెల్లడించారు.

ఐటీ ఉద్యోగం చేస్తూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న యువ రైతు రిషి, తూర్పుగోదావరికి చెందిన సత్యల శ్రీనరసింహా ప్రకృతి వ్యవసాయంలో మెలకువలను తెలియజేశారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ కార్యదర్శి జేవీ రత్నం జీవవైవిధ్యం ఆధారంగా వ్యవసాయం ఎలా చేయాలి, తక్కువ పెట్టుబడితో ఎలా లాభాలు ఆర్జించాలని అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, సంఘం అధ్యక్షుడు పీఎల్ఎన్ రాజు, కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ మేళాలో సేంద్రియ పంటలతో కూడిన 120 స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా 3వ రోజు కూడా భారీగా సందర్శకులు తరలివచ్చి విక్రయాలు చేశారు.

కోనసీమ.. వెల్‌విష్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన కోనసీమ వెల్‌విష్ సంస్థ ప్రదర్శించిన కొబ్బరి ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక ప్లాంట్ ద్వారా తయారు చేసిన కొబ్బరి ఆయిల్, కొబ్బరి పౌడర్, కొబ్బరి మిల్క్‌లను ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. దీంతో పాటు కొబ్బరి వాటర్ మార్కెటింగ్ కూడా ఈ సంస్థ చేపట్టింది.

హాట్ అండ్ కూల్ బ్యాగ్స్



గుంటూరుకు చెందిన సంస్థ విక్రయించిన హాట్ అండ్ కూల్ బ్యాగ్స్ మేళా సందర్శకులను ఆకట్టుకున్నాయి. సింథటిక్ క్లాత్‌తో ఈ బ్యాగ్‌ను తయారు చేశారు. బ్యాగులో వాటర్ నింపుకునేందుకు వీలుగా మూత నిర్మాణం చేశారు. దీంతో ఈ బ్యాగ్‌లో హాట్ వాటర్‌తో పాటు కూల్ వాటర్ నింపుకుని శరీర అలసట సమయంలో మర్ధన చేసుకోవచ్చు. వాటర్ బ్యాగ్ నుంచి బయటకు కారకుండా సింథటిక్ క్లాత్‌ను వాడారు.

భూ వివాదంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న గోవింద్

కొయ్యూరు: ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూమిలో కంచె వేస్తుండగా మరొకరువచ్చి అభ్యంతరం తెలపడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రావణాపల్లి పంచాయతీ తోటలూరుకు చెందిన గొంప గోవింద్ అనే వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా భూమిని సాగుచేస్తున్నాడు. ఆదివారం పొలంలో కంచె ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్న సమయంలో డిగెట్ల రాము అనే వ్యక్తి అభ్యంతరం తెలిపాడు. ఈ భూమి తన పేరుమీద ఉందని చెప్పాడు. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తీవ్ర మనస్తాపంతో ఇంటికి వెళ్లిన గోవింద్.. రాము కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖరాసి, పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతనిని కృష్ణదేవిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.గోవింద్ ఆత్మహత్యకు ప్రయత్నించడానికి భూ వివాదం కారణమని ఎస్ఐ రాజారావు తెలిపారు. రెవెన్యూ అధికారులు సమస్య పరిష్కరిస్తారని ఆయన చెప్పారు.

రక్తనిధికై.. ఆగని నడక

- రక్తదానంపై ప్రజల్లో అవగాహనకు యువకుడి సాహసం
- 21 వేల కిలోమీటర్లే లక్ష్యంగా సాగుతున్న పాదయాత్ర
- 2021 డిసెంబర్‌లో తిరువనంతపురంలో ప్రారంభం..
- కిరణ్‌కు స్వాగతం పలికిన నగరంలోని రక్తదాతలు



కిరణ్ వేర్మ

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): రక్తం కొరతతో ఆస్పత్రిలో ఓ రోగి చావు బతుకుల మధ్య పోరాటం చేస్తున్నాడు. రక్తం కావాలని ఓ యువకుడికి ఫోన్ కాల్ వచ్చింది. అందుకు స్పందించిన ఆ యువకుడు ఆ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. అయితే తర్వాత రోజు ఆ యువకుడికి ఓ విషయం తెలిసింది. తనకు ఫోన్ చేసిన వ్యక్తి ఆ రోగి నుంచి రూ.1,500 తీసుకున్నాడని తెలిసి షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనతో అసలు రక్తదానంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి విచారణ చేపట్టాడు. రక్తం కొరత తీర్చడానికి తనవంతుగా ఏదో ఒకటి చేయాలని భావించాడు. సింప్లీ బ్లడ్ అనే సంస్థను స్థాపించి.. దేశ వ్యాప్తంగా రక్తదానంపై అవగాహన కల్పించేందుకు 21వేల కిలోమీటర్ల పాదయాత్రకు శ్రీకారం చుట్టాడు. అతనే ఢిల్లీకి చెందిన 38 ఏళ్ల కిరణ్ వేర్మ. కిరణ్ పాదయాత్ర ఆదివారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా రక్తదాతలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

రక్త కొరత తీర్చేందుకు..

తాను మోసపోయినట్లు మరొకరు మోసపోకూడదని కిరణ్ 2017లో వర్చువల్ బ్లడ్ డొనేషన్ ప్లాట్ ఫాం, సింప్లీ బ్లడ్ సంస్థలను నెలకొల్పాడు. సింప్లీ బ్లడ్ అనేది మొబైల్ యాప్/వెబ్‌సైట్. దీని ద్వారా రక్త నిల్వలు, రక్తదాతల సమాచారం తెలుసుకోవచ్చు. వర్చువల్ బ్లడ్ డొనేషన్ ద్వారా 180 దేశాలకు చెందిన రక్తదాతలను అనుసంధానం చేసి రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు.

చేదు అనుభావాలే పాదయాత్రకు స్ఫూర్తి

'ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ నుంచి ప్రాణాలు రక్షించుకునేందుకు ప్లాస్మా అవసరం ఏర్పడింది. ముఖ్యంగా రెండో దశలో ప్లాస్మా కోసం వేల సంఖ్యలో రోగులు ఎదురు చూశారు. సింప్లీ బ్లడ్‌కు వేల వినతులు వచ్చాయి. కోవిడ్ నుంచి కోలుకున్న యువతకు ఫోన్ చేసి ప్లాస్మా దానం చేయాలని కోరారు. అయితే చాలా మంది ప్లాస్మా దానం చేసేందుకు ముందుకు రాలేదు. అప్పుడే దేశవ్యాప్తంగా ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించాలనే ఆలోచన మొదలైంది.' అని కిరణ్ తెలిపాడు. 2021 డిసెంబర్ 28న తిరువనంతపురంలో 21 వేల కిలోమీటర్ల పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు చెప్పాడు. రోజుకు 10 నుంచి 30 కి.మీ మేర పాదయాత్ర సాగిస్తున్నట్లు వివరించాడు.

రక్తం కొరత లేకుండా చేయడమే ధ్యేయం

రక్తం సమయానికి అందక ఏడాదికి లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అలా జరగకుండా ఉండాలంటే ఏటా 50 లక్షల మంది రక్తం దానం చేయాలి. అలా చేయడం ద్వారా 2026 నాటికి దేశంలో రక్తం కొరత అనేది ఉండదు. అలా చేయడమే నా లక్ష్యం. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా. నా లక్ష్యాన్ని చేరుకోవడానికి మరో ఏడాది సమయం పడుతుంది. ఈ పాదయాత్రలో ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నా. సరైన ఆహారం తీసుకుంటూ..నిరంతరం వైద్యులతో సంప్రదింపులు చేసుకుంటూ యాత్రను కొనసాగిస్తున్నాను. – కిరణ్


సంక్రాంతి తరువాత గ్రామాల్లో ఫైబర్‌నెట్ కొత్త కనెక్షన్లు


మార్కెట్ యార్డులో ఫైబర్‌నెట్ సర్వర్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ గౌతమ్‌రెడ్డి

అనకాపల్లి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారులకు సంక్రాంతి తరువాత దశల వారీగా కొత్త కనెక్షన్లు అందించనున్నట్లు ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో గల ఫైబర్‌నెట్ సర్వర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అతి తక్కువ ధరలతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇంటర్‌నెట్ సౌకర్యంతోపాటు టీవీ ప్రసారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఫైబర్‌నెట్ కొత్త బాక్సులను వినియోగదారులకు ఉచితంగా అందజేస్తామన్నారు. జిల్లా ఫైబర్‌నెట్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌రెడ్డి, ఆపరేటర్లు శ్రీనివాస్, నూకేష్, రమేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

భళా బాలకా..

- సైనిక విన్యాసాలను తలపించిన విద్యార్థుల ప్రదర్శనలు
- వైభవంగా గుడిలోవ విజ్ఞాన విహార్ వార్షికోత్సవం


సామూహికంగా పిరమిడ్ విన్యాసం చేస్తున్న విద్యార్థులు


మోటార్ బైక్‌పై విద్యార్థినుల విన్యాసం


మోటార్ బైక్‌తో హైజంప్ చేస్తున్న విద్యార్థి


మల్ల కంబపై నిప్పు కాగడాలతో విద్యార్థుల విన్యాసం

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్ విద్యాలయం వార్షికోత్సం సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు సైనిక విన్యాసాలను తలపించాయి. ఆహుతులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. కొన్ని సాహసోపేతమైన విన్యాసాలు ఔరా అనిపించాయి. మండుతున్న అగ్నిగోళం నుంచి మోటార్ బైక్‌తో దూకడం, ట్యూబ్ లైట్లను పగలు గొట్టుకొని మోటార్ బైక్‌తో దూకడం, హైజంప్ చేస్తూ ట్యూబులైట్లను పగలు గొట్టుకొని దూకడం వంటి విన్యాసాలు గగుర్పాటు కలిగించాయి. వారిలో గల ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిశాయి. విద్యార్థి, విద్యార్థినులు మోటార్ సైకిల్‌పై ముగ్గురు నుంచి ఏడుగురు వరకు నిలబడి ఆసనాలు వేయడం, జాతీయ పతకాలు చేతబూని విన్యాసాలు చేయడం ఆశ్చర్యం కలిగించాయి. మల్లకంబపై ఒక పద్ధతిలో విద్యార్థులు కూర్చొని నిప్పుకాగడాలతో ఒకే సారి మంటలను రేపిన అంశం విద్యార్థుల సాహసానికి నిదర్శనంగా నిలిచింది. పేర్లార్ బార్‌పై విద్యార్థులు నిలబడి నిర్మించిన పిరమిడ్ గోపురం అంశం, 20 మంది విద్యార్థులు ఒకేసారి ఒకే స్పీడ్‌లో చేసిన వ్యాయామ విన్యాసాలు, వివిధ రకాల పద్మాకార విన్యాసాలు, గిరిజన నృత్యాలు, కోలాటం వంటి అంశాలను, సంగీతం, సాహిత్యం మేళ వింపుతో అభినయించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు, విజ్ఞాన విహార్ చైర్మన్ పి.రామకృష్ణమూర్తి, ఆర్ఎస్ఎస్ ప్రెసిడెంట్ పి.వి.నారాయణ, విజయనగరం డీఆర్వో ఎం.గణపతిరావు, విజ్ఞాన విహార కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరావు, నోవస్ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ పార్టనర్ ధర్మేంద్ర వరద పాల్గొన్నారు.


ట్యూబ్ లైట్లను పగలు గొట్టుకుంటూ మోటార్ బైక్‌తో దూకుతున్న విద్యార్థి


మండుతున్న అగ్నిగోళం నుంచి మోటార్ బైక్‌తో దూకుతున్న విద్యార్థి విన్యాసం